శానిటేషన్‌పై సమీక్షా సమావేశం

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గురువారం స్పెషల్ ఆఫీసర్ రఘు ప్రసాద్ శానిటేషన్‌పై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్‌లో చెత్త, పారిశుద్ధ్యం సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోడ్లను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

వేతన ఒప్పందం.. సన్మానం




రంగారెడ్డినగర్: కార్మికుల న్యాయమైన హక్కుల కోసం ఎంతవరకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉంటానని శ్రమశక్తి అవార్డు గ్రహీత, కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. గాంధీనగర్ పారిశ్రామికవాడలోని ఆర్ఢీ ఇంజనీరింగ్ పరిశ్రమ వేతన ఒప్పందం జరిగిన సందర్భంగా గురువారం కార్మికులు మదన్‌గౌడ్‌కు సన్మానించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు జీతం పెంపుదలతో పాటు ఇతర అలవెన్స్‌లు ఇచ్చేందుకు ఆర్ఢీ ఇంజనీరింగ్ పరిశ్రమ యాజమాన్యంతో వేతన ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ యూనియన్ ప్రెసిడెంట్ సుమిత్‌సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్, రాంబాబు, ప్రధాన కార్యదర్శి దేవేందర్. లీ ఫార్మా, శ్రీనిధి సెక్యూరిటీ ప్రింటింగ్ తదితర పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షుడిగా జనార్దన్



జగద్గిరిగుట్ట: రాష్ట్రీయ దళిత సేన విభాగం ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎం జనార్దన్ ఎన్నికయ్యారు. గురువారం జగద్గిరిగుట్ట లో రాష్ట్రీయ దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జేబీ రాజు చేతుల మీదుగ నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉన్న బీసీలు ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీసీల రాజ్యాధికారం కోసం కృషి చేస్తానన్నారు.తనకు బాధ్యత అప్పగించిన రాష్ట్రీయ దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జేబీ రాజు, ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్, రాష్ట్రీయ దళిత సేన ప్రధాన కార్యదర్శి వై బాల రాజు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

సన్‌రైస్ స్కూల్ వార్షిక వేడుకలు



పట్టాలు అందుకుంటున్న చిన్నారులు

దుండిగల్: దుండిగల్‌లోని సన్ రైస్ మోడల్ స్కూల్‌లో గురువారం వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అదే విధంగా చిన్నారులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావాలి గణేష్, మాజీ కౌన్సిలర్ అమరం గోపాల్‌రెడ్డి, పాఠశాల కో ఆర్డినేటర్స్ భూపాల్ రెడ్డి, దయాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



సుభాష్‌నగర్: గాజులరామారంలోని సర్వే నెంబర్ 307, 342 ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్ గురువారం నిర్మాణాలను పరిశీలించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం సర్వే నెంబర్ 307లో 5 గదులు, 8 బేస్‌మెంట్లు, సర్వే నంబర్ 342లో ఒక షెడ్డును పోలీసుల బందోబస్తు మధ్య జేసీబీతో కూల్చి వేశారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణం చేపడితే కూల్చివేతలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గంజాయి విక్రయదారుడి రిమాండ్

కుత్బుల్లాపూర్: 900 గ్రాముల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సుచిత్ర చౌరస్తాలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. గురువారం దాడులు నిర్వహించగా.. బాలాపూర్ షహీన్‌నగర్‌కు చెందిన ర్యాపిడో రైడర్ షేక్ అబ్దుల్ వసీం(29) పట్టుబడ్డాడు. గంజాయిని స్వాధీనం చేసుకుని అతడిని రిమాండ్‌కు తరలించారు.

కబ్జా కోరల్లో నాలా!

● వర్షం పడితే గంపలబస్తీలోని ఇళ్లల్లోకి నీరు ● ఇబ్బంది పడుతున్న ప్రజలు ● పట్టించుకోని అధికారులు

చినుకు పడితే ఆ కాలనీ ప్రజల్లో వణుకే.. గట్టిగా గంటసేపు వర్షం పడితే చాలు ఇళ్లల్లోకి నీళ్లే.. అదే ఒక నాలుగు గంటల వర్షం కురిస్తే ఇంట్లో సామానులు తడిచి ముద్దవ్వాల్సిందే.. పోని ఈ కాలనీలు లోతట్టు ప్రాంతాల్లో ఉన్నాయా? అంటే అదేమీ లేదు.. స్వార్థపరులు నాలాను సైతం కబ్జాచేశారు. దీంతో కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వదిలేశారు. ఇది సుభాష్‌నగర్ గంపలబస్తీ ప్రజలకు శాపంగా మారింది.



8 ఫీట్లకు కుచించుకుపోయిన నాలా

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్‌లో ఎస్వీ కో ఆపరేటీవ్ సొసైటీ, వెంకటాద్రినగర్ కాలనీ మధ్యలో ఎస్వీ కో ఆపరేటీవ్ సొసైటీ నుంచి వర్షపు నీరు వచ్చే నాలా ఉంది. సదరు నాలా ప్రభుత్వ నిబంధనల ప్రకారం 15 ఫీట్లు ఉండాలి. కానీ కొంతమంది కబ్జా చేయడంతో ఒక చోట నాలా 8 ఫీట్లు, మరో చోట 4 ఫీట్లు.. అనంతరం నాలానే లేకుండా పోయింది. అధికారులు కూడా చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలా కబ్జాకు గురైందని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లల్లోకి నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు

ఇక వర్షం కురిసినపుడు ఎస్వీ కోఆపరేటీవ్ పారిశ్రామికప్రాంతం, ఫాక్స్‌సాగర్ వైపు నుంచి నాలాలోకి భారీగా వర్షపునీరు చేరుతుంది. నాలా కబ్జా జరిగిన చోటు నుంచి వర్షపు నీరు రోడ్లపైకి చేరి నేరుగా ఇళ్లల్లోకి చేరుతుంది. ఇక ఇళ్లలో ఉన్న ప్రజలు కట్టుబట్టలతో బయటకు వచ్చి సహాయం కోసం ఎదురు చూడాల్సిందే.



అడ్డుగా గోడ కట్టడంతో 3 ఫీట్లుగా..

వారం క్రితం కురిసిన వర్షానికి కొట్టుకొచ్చిన ప్లాస్టిక్ కవర్లు



అధికారులు ఆపలేదు.. ప్రజాప్రతినిధులు నిలదీయలేదు

గత 20సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నాం. నాలాలు కబ్జాకు గురవుతున్నా ఇక్కడి అధికారులు ఆపలేదు.. ప్రజాప్రతినిధులు నిలదీయలేదు. చూసేలోగా నాలా స్థలం కబ్జాకు గురైంది. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా సమస్యకు పరిష్కారం లభించలేదు. అండర్‌గ్రౌండ్ నుంచి వర్షపు నీరు వెళ్లేలా చూస్తామని అధికారులు చెప్పడమే తప్పా చేసిందేమీ లేదు.



– లక్ష్మి, వెంకటాద్రినగర్ కాలనీ అధ్యక్షురాలు



ఇంట్లోకి నీరు రావడంతో పిల్లలతో సజ్జాపై కూర్చున్న మహిళ(ఫైల్)

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, సిబ్బంది

కుత్బుల్లాపూర్: విద్యార్థులను తీసుకువెళ్లే బస్సు డ్రైవర్లు, హెల్పర్లు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారముండదని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. గురువారం కొంపల్లిలోని సాధువాస్వానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను తీసుకువెళ్లే బస్సు డ్రైవర్లు వాహనాన్ని నడిపే సమయంలో మొబైల్ ఉపయోగించరాదని, అదే విధంగా రాంగ్‌రూట్‌లో వెళ్లరాదని సూచించారు. అదే విధంగా స్కూల్ బస్సుకు ఫ్రంట్ సైడ్ వ్యూ మిర్రర్, ఫైర్ డిటెక్టింగ్ అలారం సిస్టమ్, బస్సులో సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. కనీసం ఐదు సంవత్సరాల డ్రైవింగ్ అనుభవం ఉన్నవారిని డ్రైవర్లుగా నియమించాలని, 60 సంవత్సరాల దాటిన వారిని విధుల నుంచి తొలగించాలన్నారు. పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ నిబంధనలు, రూల్స్‌ను పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని నిరసన

నిజాంపేట్: మల్లంపేటలోని రామచంద్రయ్య కాలనీలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని గురువారం కాలనీ వాసులు నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్, ఏఈ ఇతర ఆఫీసర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా క్రాంతి నగర్ కాలనీ మీదుగా బొల్లారం ఐటీసీ భద్రాచలం కంపెనీ మీదుగా పాతనాలాలోకి వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మడికుంట, కొత్తగుంట, చనస్నెరులో కూడా డ్రైనేజీ కలవకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉమాదేవి, కృష్ణవేణి, సుజాత, సుప్రియ, స్వప్న, మహాలక్ష్మి, కవిత, పద్మ,మురళి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కమిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని వినతి

రంగారెడ్డినగర్: మధ్యలో నిలిచిపోయిన కమిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని రంగారెడ్డినగర్ డివిజన్ ఇందిరా గాంధీనగర్ బస్తీ వాసులు కోరారు. కాంగ్రెస్ నాయకులు గురువారం కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం చేపట్టిన కమిటీ హాల్ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేశారన్నారు. నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రంగారెడ్డినగర్ డివిజన్ ప్రెసిడెంట్ శివ కుమార్, మేడ్చల్ జిల్లా ఓబీసీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ తైలం శ్రీనివాస్, ఇందిరా గాంధీనగర్ వాసులు గోపాల్ యాదవ్, మోహన్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మహా సభలను విజయవంతం చేయాలి

జగద్గిరిగుట్ట: తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర 4 వ మహాసభల వాల్ పోస్టర్‌ను జగద్గిరిగుట్ట భవన నిర్మాణ కార్మిక అడ్డా వద్ద గురువారం ఆవిష్కరించారు.
21, 22 తేదీల్లో శంషాబాద్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని, భవన నిర్మాణ కార్మికులు పెద్దఎత్తున తరలి రావాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఏసురత్నం కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు హరినాథ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జగద్గిరిగుట్ట భవన నిర్మాణ సంఘం నాయకులు సామ్యూల్, జంబూ, చారి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గం అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకుంటుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని శ్రీశైలం గౌడ్ నివాసంలో పలు సంక్షేమ సంఘాల నేతలు, ప్రజలు కలిసి తమ సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనునిత్యం అణగారిన వర్గాల అభివృద్ధికి అండగా ఉంటానని, అలాగే నియోజకవర్గంలో స్థానిక సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గణనీయంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కూన శ్రీశైలంగౌడ్‌కు సమస్యలను వివరిస్తున్న మహిళలు

శ్మశాన వాటికల్లో ధరల మార్పు

నిజాంపేట్ : నిజాంపేట్ నగరపాలక సంస్థ పరిధిలో గల అన్ని శ్మశాన వాటికలలో దహన సంస్కారముల ఖర్చులు ఈ విధంగా తీర్మానించడం జరిగిందని కమిషనర్ సాబేర్ అలి గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. వాహన చార్జీలు రూ.3000, కాష్టం (కట్టెలు, కిరోసిన్)చార్జీలు రూ.5000, దహన సంస్కారములు చేసిన వారసునకు శిరోముండనం చార్జీలు రూ.1000, ఇతరులకు శిరోముండనం చార్జీలు రూ.100, డప్పు ఖర్చులు రూ.1500 చార్జీలు పెంచినట్లు తెలిపారు. ఆయా శ్మశాన వాటికలో ఉన్న కాటి కాపరులు, బ్యాగరివారు, మంగలి, డప్పుల వారు సదరు చార్జీలను మించకుండా మాత్రమే వసూలు చేయాలని తెలిపారు. ఈ చార్జీలు కాకుండా అదనంగా వసూలు చేస్తే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కమిషనర్ తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం



పాదయాత్రలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

నిజాంపేట్: ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా ఏఐసీసీ అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం 24, 25వ డివిజన్‌లలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను ప్రజలందరికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొలన్ వీరేందర్‌రెడ్డి, చిట్ల దివాకర్, ఇంద్రజిత్‌రెడ్డి, ఆవుల జగదీష్, రఫియాబేగం, కడియాల ఇందిరా, కొలన్ జీవన్‌రెడ్డి, రాజిరెడ్డి, వీరబాబు, వరగాని వాసు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో ఇకనుండి ముగ్గురు సబ్ రిజిస్ట్రార్‌లు

ఇటీవలే ఇద్దరి నియామకం



అశోక్ కుమార్



శ్రీనివాస్



ఫర్ హా

సుభాష్‌నగర్: ప్రస్తుతం కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక్కరే సబ్ రిజిస్ట్రార్ అధికారి విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు 100కు పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రభుత్వం స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించడంతో కుత్బుల్లాపూర్‌కు ఏకంగా రోజుకు 144 స్లాట్ బుకింగ్ అవకాశం కల్పించింది. దీంతో రద్దీ దృష్ట్యా ప్రభుత్వం మరో ఇద్దరి సబ్ రిజిస్ట్రార్లను నియమించింది. ప్రస్తుతం కొన్ని నెలలుగా అశోక్ కుమార్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తుండగా, చండూర్‌లో పనిచేసే శ్రీనివాస్, డీఐజీ ఆఫీస్‌లో ఆడిట్‌గా పనిచేసే ఫర్ హా ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఘనంగా సంస్కృతి పాఠశాల వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట లోని సంస్కృతి పాఠశాల 15వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ జగన్, జగద్గిరిగుట్ట సీఐ నరసింహులు ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాల కరస్పాండెంట్ బాల్‌రాజ్‌గౌడ్‌తో కలిసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అంజనేయులు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు వినోద్ జాదవ్, వెంకటేష్, నరసింహులు గౌడ్, దయాకర్, సుధాకర్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ బాల్‌రాజ్‌గౌడ్

రిలాక్స్ మాట్రెస్సెస్ అండ్ సోఫా పరిశ్రమలో అగ్నిప్రమాదం



పరిశ్రమ లోపల కాలిపోయిన దృశ్యం

జీడిమెట్ల: రిలాక్స్ మాట్రెస్సెస్ అండ్ సోఫా పరిశ్రమలో విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఫైర్ అధికారి వివరాల ప్రకారం.. సురేష్ అనే వ్యక్తి జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డులో రిలాక్స్ మాట్రెస్సెస్ అండ్ సోఫా వర్క్స్ పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే పరిశ్రమ సిబ్బంది బుధవారం రాత్రి పరిశ్రమకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం లోపలి నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న జీడిమెట్ల అగ్నిమాపక అధికారి శేఖర్‌రెడ్డి వెళ్లేసరికి పరిశ్రమ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే లోపల సీలింగ్‌తో పాటు కొన్ని పరుపులు కాలిపోయాయి.

నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమ

సదరు పరిశ్రమ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని జీడిమెట్ల ఫైర్ అధికారి తెలిపారు. వాహనాలు పార్కింగ్ చేసే సెల్లార్‌లో సైతం ఇష్టారీతిగా మెటీరియల్‌ను ఉంచారన్నారు. సదరు పరిశ్రమ యజమానికి ఇప్పటికే ఇక్కడ పరిశ్రమ నడపకూడదని చెప్పినట్లు ఫైర్ ఆఫీసర్ అన్నారు.

మెరుగైన సేవల కోసమే 'స్లాట్ బుకింగ్'

కలెక్టర్ గౌతమ్ కుమార్

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌లు పారదర్శకంగా, అవినీతి రహితంగా, సులువుగా, తక్కువ సమయంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రవేశపెట్టిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌కుమార్ అన్నారు. కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. మొత్తం 93 స్లాట్లకు గాను 93 రిజిస్ట్రేషన్లు విజయవంతంగా జరిగాయి.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు వారికి అనుకూలమైన తేదీ, సమయాన్ని rigistration.telangana.gov.in వెబ్ సైట్‌లో ఎంపిక చేసుకుని రిజిస్ట్రేషన్లకు వచ్చే విధంగా ప్రభుత్వం వెసలుబాటు కల్పించిందన్నారు. రాష్ట్రంలోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రక్రియలో భాగంగా జిల్లాలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రక్రియను పరిశీలించామని తెలిపారు. ఈ రోజు ఎన్ని స్లాట్‌లు బుక్ అయ్యాయని, స్లాట్ బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎలా జరుగుతుందని, ఆన్‌లైన్‌లో క్షుణ్ణంగా పరిశీలిస్తూ కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ రిజిస్ట్రార్ సీహెచ్ అశోక్, మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాష్, కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయదారుల రద్దీ



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్ కుమార్

తొందరగా రిజిస్ట్రేషన్ చేశారు

నిజాంపేట్‌లోని నాగేశ్వరరావు నుంచి ఫ్లాట్ కొనుగోలు చేశా. స్లాట్ బుకింగ్ ద్వారా మొట్టమొదటిగా తన రిజిస్ట్రేషన్ 15 నిమిషాల వ్యవధిలో చేశారు. గతంలో మా ప్లాట్లు ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇక్కడికి వచ్చా. ఉదయం నుంచి రాత్రి వరకు నిరీక్షించాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఇంత వేగవంతం చేయడం బాగుంది. ఇక గంటల తరబడి నిరీక్షించాల్సిన పనిలేదు.

– చైతన్య, కొనుగోలుదారుడు, నిజాంపేట్